రోడ్డుమీద ఏక్సిడెంట్ కి గురి అయిన కుక్కకి మనిషికి తేడాలేదా?

గంటిరమాదేవి కథ

# కుక్కచావు

నడిరోడ్డులో కుక్క! రోడ్డు దాటాలని ప్రయత్నిస్తోంది. వచ్చేపోయే వాహనాలను భయం భయంగా చూస్తోంది. నన్ను వెళ్లనీయండి అని చెప్పడానికి నోరుగానీ ఆగమని సంజ్ఞ చేయడానికి చేతులుగానీ లేవు. అంతులేని ప్రవాహం లాటి ట్రాఫిక్! అవతల వైపు వెళ్ళాలి. మండే కడుపుకు ఏదైనా దొరకొచ్చు.

ధయిర్యం చేసి ముందుకు నడిచింది. నడిరోడ్డులో కుక్క. భూతంలా ఓ లారీ! మనిషిని చూసినా ఆగని లారీకి కుక్క ఓ లెక్కా!

బలమైన, బరువైన లారీ చక్రాలు ఆ నడిరోడ్డులో కుక్కను తాకాయి. ఎముకలు పిండయి, రక్తపు ముద్దలా మారింది. ఒక క్షణం క్రితం భయం, బాధ, ఆకలి, ఆశ వున్న జీవి. మరుక్షణంలో మాంసంముద్ద విలవిలలాడుతోంది.

లారీ వెనకే వచ్చిన స్కూటరిస్టు, చచ్చిన కుక్కను చూసి టక్కున వేగం తగ్గించి తన వాహనాన్ని తిప్పి మళ్లీ వేగం పెంచాడు. ఆయనింట్లో మూడు కుక్కలున్నాయి. విప్పెడ్, ఆల్సేషియన్, దక్ష్వాండ్. చచ్చిన దొక వీధికుక్క.

వెనకో ఆటో. మరీ దగ్గర కొచ్చేసింది. బ్రేక్ వేసే టైమ్ లేదు. కుక్క శవం పచ్చడయింది. కొనప్రాణం కాస్తా ఎగిరిపోయింది.

తర్వాత మరో బస్సు కసిగా కుక్కమీంచి పోయింది. రోడ్డు దీనబ్బ సొమ్మా! రోడ్డుకు



అంటుకుపోయింది కుక్క శవం. రక్తం నలుప్రక్కలా చిమ్మింది. బుల్‌డోజరు ఎత్తుపల్లాలను సమానం చేసినట్టు ఆ ప్రభుత్వ వాహనం బుల్‌డోజర్ చేసే పని కూడా చేసింది. కుక్క శరీరం సమానంగా రోడ్డంతా పరుచుకుంది.

ఆ కుక్క, కుక్కచావు చచ్చింది.

అపర్ణ పెట్టిన టిఫిను గబగబా తింటు

న్నాడు రాఘవరావు. "ఏమిటి తొందర?" ప్రేమతో కూడిన చిరుకోపంతో భర్త నడిగింది అపర్ణ.

"అప్పారావుకు ఆఖరు ఇన్‌స్టాల్‌మెంటు కట్టాలి. చిట్టీ బాపతు పదింటికి ఆఫీసులో ఉండాలి. నాలుగు మైళ్ల దోవకి అరగంట పడుతుంది జంటనగరంలో. మధ్యలో ఆటోవీరులు, సైకిలిస్టు శిఖామణులు, లారీ యోధులు... ఇవన్నీ తప్పించుకుని వెళ్లేసరికి పునర్జన్మ ఎత్తినట్టే. అరంగుళం ఖాళీలో ఆటో సూదిని ట్రాఫిక్ శరీరంలో గుచ్చాలని చూస్తాడుఆటోవీరుడు. స్కూటర్లను, ఆటోలను దాటివెళ్లాలని చూస్తాడు సైకిల్ శిఖామణి, భూతాల్లా మీదకొచ్చేస్తారు లారీ యోధుడు. టైము కందుకోవాలంటే తొందరే మరి... ఇవి జంటనగరాలు కావు —పెంట నగరాలు..." టిఫిను పూర్తిచేసి కాఫీ తాగుతూ అన్నాడు రాఘవరావు.

"ఇంత అవస్థ పడుతూ దిక్కుమాలిన ఈ గుమాస్తా ఉద్యోగం చెయ్యకపోతేనేమి? మా అన్నయ్య రైస్‌మిల్లులోనో, మా నాన్న పొలాల్లోనో మీకిష్టమైన పని చేసుకోమని చెపితే వింటారా?"

"అపర్ణా! అలా చేయదలుచుకుంటే మా వాళ్లే వున్నారు. మా అన్నయ్య అరేబియా దేశాల్లో ఇంజనీరు. మాకూ పొలంపుట్టా బాగానే ఉన్నాయి. మా వాళ్లు ప్రాణం ఇస్తారు నా కోసం. నీకు తెలుసుగా నాకు ఒకళ్లమీద ఆధారపడ్డం ఇష్టం వుండదని!"

"సరే! సాయంత్రం తొందరగా రండి. బాబును డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లాలి. పోలియో మందు మళ్లీ ఎప్పుడు వేస్తాడో కనుక్కోవాలి. మార్కెటునుండి సరుకులు తెచ్చుకోవాలి. జాగ్రత్త..."

స్కూటర్ స్టార్ట్ చేసి బయలుదేరుతున్న భర్తతో మళ్లీ అంది అపర్ణ. "జాగ్రత్త! దిక్కుమాలిన ట్రాఫిక్. మెల్లిగా వెళ్లండి..."

"ఏం ఫర్వాలేదు. రెండేళ్ల నుండి వెళ్తొస్తున్నాగా... సాయంత్రం వే వచ్చేసరికి సిద్ధంగా వుండు. ఆ డాక్టరు దగ్గర జాతరలా వుంటారు జనం."

రోడ్డు చివర రాఘవరావు మలుపు తిరిగాడు. అపర్ణ లోపలకు వచ్చి తలుపేసుకుంది. బాబు లేచాడు. వాడికి పాలు పట్టి స్నానం చేయించే ప్రయత్నంలో పడిపోయింది.

* * *

చెవి దగ్గర పెద్దహోరు వినపడింది రాఘవరావుకు. ఏదో వాహనం మరీ దగ్గరగా వచ్చేసింది. స్కూటర్ స్లో చేసి రోడ్డుకు ఎడమప్రక్కగా ఫుట్‌పాత్ దగ్గరగా నడిపాడు. చెవిలో పిడుగు పడ్డట్టు శబ్దం. శరీరం తేలికయి గాలిలో ఎగురుతున్నట్లు అనిపించింది. రాఘవరావు ఇప్పుడు స్కూటర్‌మీద లేడు. ఎగిరి ఫుట్‌పాత్‌మీద పడ్డాడు. రాఘవరావు గుండె దడదడలాడింది. "ఏక్సిడెంట్!!! తనకే??" నేలమీద పడ్డా బాధ తెలీడంలేదు. లేచినిలబడ్డాడు. కాలు

కలుక్కుమంది. నిలబడలేక క్రింద కూలబడ్డాడు. అప్పుడు చూశాడు. తెల్లటి చొక్కామీద తడితడిగా! ఎర్రగా! రక్తం!! ఎడమకంట్లో రక్తం కారుతోంది. ఆ కంటిచూపు మసగ్గా అయింది.

జనం ఈగల్లా ముసురుతున్నారు. 'అయ్యో ఏక్సిడెంట్ ఆటో గుద్దేసింది. వెధవ ను పట్టుకోండి' అంతులేని సానుభూతి.

తలెత్తి చూశాడు రాఘవరావు. గణపతి విలాస్ హోటల్ శాఖహార పలహార భోజనశాల.

హోటలునుండి జనం బిలబిలా వచ్చారు. వలయాకారంగా రాఘవరావు చుట్టూ మూగారు. రాఘవరావు ఎడమకన్ను పూర్తిగా మూసుకుపోయింది. మొద్దుబారిన మెదడు తిరిగి పనిచేయడం ప్రారంభించింది. తలలో విపరీతమైన బాధ, సమ్మెటలతో లయబద్ధంగా కొడుతున్నట్టు చొక్కా పూర్తిగా రక్తంతో తడిసింది.

"బాగా దెబ్బలు తగిలాయి. ఎవరేనా ఆసుపత్రికి తీసుకెళ్ళండి....." గుంపులో ఎవరో అన్నారు.

"ఇది ఏక్సిడెంటు కేసు! పోనీగదా అని తీసికెడితే చిక్కులో పడతాం. పోలీసులతో వెధవ గొడవ"

"అవును పోలీసులకే చెప్తే!"

"చెప్పచ్చు! ముందు మన్నే దబాయిస్తాడు. ఉపకారం చేయబోతే ఉరి తగిలినట్టవుతుంది"

"పాపం! రక్తం బాగా పోతోంది. దగ్గరలో ఏ డాక్టరుకయినా చూపిస్తే!"

"ఏక్సిడెంటు వాళ్ళ తీసుకోరు! పోలీసులతో గొడవలొస్తాయని వాళ్ళకు భయమే...."

"దాహం! దాహం!" రాఘవరావు అరిచాడు.

"దాహం కావాల్రా! హోటలు వాడికి చెబితే ఇస్తాడేమో!" హోటలులోకి



'వెళ్ళాడొక్కడు.

"ఆటో గుద్దేసిన మనిషికి దాహం కావాలిట— నీళ్ళివ్వండి" గణపతి విలాస్ హోటల్ మేనేజర్ కాలిముత్తు రాయిలా మాట్లాడలేదు. తనకెందుకు వెధవ రొంపి! మున్సిపాలిటీ వాళ్లతోను, హెల్త్ వాళ్లతోను, సేల్సు టాక్సు వాళ్ళతోను చిక్కులు రోజూ! ఇక పోలీసులు కూడా తోడయితే. సర్వర్ ఈ మాటలు విన్నాడు. అల్యూమినియం గ్లాసులో నీళ్లుపోసి బయటకు తీసుకువెళ్లాడు. ఆశగా చూసాడు రాఘవరావు. "దాహం! దాహం!"

క్రమంగా నీరసం ఆవహిస్తోంది. ఎవ రైనా ఆసుపత్రికి తీసికెడితే బాగుండును. రక్తం ధారగా పోతూనేవుంది. ఎక్కడో శిర తెగినట్టుంది.

"అరే! పైత్తికారి! ఎన్నాడా అది? వన్ను చిక్కులో పెట్టి పూడుస్తావా ఏమి? ఉళ్ళపో! పోడా! ఇంకా ఏమి చూస్తువు! సోంబేరి!"

కాలిముత్తు అదుపుకు సర్వర్ భయంతో వెనక్కు తిరిగాడు. రాఘవరావు మొహంలో నిరాశ! భయం! ఈ రోడ్డుమీద ఎంతసేపు. లేని బలం తెచ్చుకున్నాడు. చేతులెత్తి గుంపుకు దండం పెట్టాడు.

"న... న్ను.... డా... క్... ట దగ్గరకు తీసుకు..." గుంపును ఉద్దేశించి అన్నాడు. రాళ్ళతో కూడిన పర్వతం ఆ గుంపు. ఎవ రూ ముందుకు రాలేదు.

రాఘవరావుకు తండ్రి, అన్న గుర్తుకొచ్చారు. తమకున్న సర్వస్వం ధారపోసి అత్యాధునికమైన ఆసుపత్రిలో మంచి చికిత్స చేయించగల ప్రేమతున్న వారు. మామగారు, బావ మరదులు క్షణాల్లో తనవక్కడనుంచి తరలించి తమ రక్త మాంసాలు ధారపోసి బ్రతికించుకోగలరు! కాని వారేరీ! ఇక్కడ లేరు! బండ బారిన హృదయం లేని చలనం లేని గుంపు. తను చచ్చిపోతాడా? అపర్ణ! అయ్యో! బాబు!... పోలియో మందు ఎవరు వేయిస్తారు! తన వాళ్లంతా ఎక్కడో వున్నారు! తన దురవస్థ వాళ్లకు తెలీదు.

"హలో! ఫుల్ హల్...." అనుకుంటూ ట్రాఫిక్ పోలీసు వచ్చాడు. నిర్లిప్తంగా రాఘవ రావు కేసి చూసాడు. రక్తం కారి నేలమీద గడ్డ కట్టింది.

"ఎవరు ముట్టక్కు వి! తర్వాత పరేషాన్ అయితది..." అని తిరిగి వెళ్ళిపోయాడు. పెన్సిలు, కాగితం, టేపు , కొలతలు ఇవి వాడికి ముఖ్యం. విలువైన కాలం కాదు.. కారిపోతున్న జీవధారమైన రక్తం కాదు

కాలేజీలో మొదటి షిఫ్టు పూర్తయింది. ఇంటరు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఇళ్ళకు వెళుతున్నారు. హోటలు ముందున్న గుంపువైపు కుతూహలంగా చూసారు.

"ఏక్సిడెంటు కామోలే! చూద్దామా!" ఓ విద్యార్థిని అంది.

"మగో! ఆడో! చూద్దాం పదండి...."

విద్యార్థినుల గుంపు అటువేపు బయలుదేరింది.

రక్తం కారుతూ, నిస్సహాయంగా పడివున్న రాఘవరావును చూసి "ప్చ్ ప్చ్" అనుకున్నారు. ఆ గుంపులో ఒక విద్యార్థిని రాఘవరావును చూసి అదిరిపడింది. తమ ఇంటి ప్రక్క వుండే అపర్ణ భర్త! తనకి కూడా

తెలుసు.

"అంకుల్! అవి పిలుస్తుంది... పైన్ను పాటలు చెప్పించుకుంటుంది..."

పరుగు పరుగున ఇంటికి వచ్చింది ఆ అమ్మాయి తల్లితో చెప్పింది తను చూసిన విషయం.

"నోరు మూసుకో! ఇటువంటి విషయాల్లో తల దూర్చకూడదు..."

తల్లి కసిరింపుతో బాధను, దుఃఖాన్ని అంతరాత్మను చంపుకుంది ఆ అమ్మాయి. అపర్ణకు ఈ విషయం తెలిస్తే వెళ్ళి భర్తను రక్షించుకుంటుంది. గుండె గొంతులో కొట్లాడినట్టుంది. ఇల్లు కదలనివ్వకుండా తాటకిలా తల్లి.

పది హేను నిమిషాల తర్వాత పోలీసు వచ్చాడు ఇంకో మనిషితో. స్కూటరు పడివున్న స్థలం నుండి రోడ్డు వరకు రాఘవ రావు పడివున్న స్థలం నుంచి స్కూటరు వరకు కొలతలు తీసుకున్నారు తీరిగ్గా. అంగుళాల, సెంటిమీటర్లా అన్న దాని మీద వాగ్యుద్ధం జరిగింది.

"నా లెక్కలో పొరబాటుండద్! చిన్నప్పుడు సితం చేసినారా!"

"అంటే మేం చెయ్యలేదనా? కాపీల్ గొట్టి పాస్ కాలేద్ బే?"

"ఏందీ! నే కాపీల్ కొట్టైన్నా అరే నాది పాత హెచ్.ఎస్.సీరా...

"చాల్ తీయ్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినావా?..."

"ఆ వస్తుందు...జీపు పరేషాన్ చేస్తుంది. బాగయిందిప్పుడు వస్తాండొచ్చు...."

దడదడమని రొద చేస్తూ జీపు వచ్చింది.

దాహం మాట మరిచిపోయాడు రాఘవ రావు. అపర్ణ బాబు తనవాళ్ళు ఇవేవీ గుర్తుకు రావడంలేదు. వెలుగు హరించి పోయి సంజె చీకట్లో నుండి గాఢాంధకారంలో ప్రవేశిస్తున్నాడు.

ఎవరో తనని జీపులో ఎక్కిస్తున్నట్టు గాని జీపు కదులుతున్నట్టుగాని తెలియదు. ఊపిరి భారంగా తీస్తున్నాడు జీవం లేనట్టు కాళ్ళూ చేతులు వేలాడేశాడు.

క్యాజువాలిటీ వార్డులో క్యూలో తనవంతు వచ్చే వరకు (!) ఎదురు చూస్తున్నాడు

## అంతేనా?



"టైం ఎంతయిందండీ?" ఓ పల్లెటూళ్ళో వాకిట్లో కూర్చున్న రైతుని అడిగాడు వెంకట్.

"పన్నెండు గంటలు!" బదులిచ్చాడు రైతు.

"అంతేనా... ఇంకా ఎక్కువ అయి ఉంటుందనుకొన్నానే?" మనసులోని మాట పైకి అనేశాడు వెంకట్.

"మా ఊళ్ళో అంతకంటే ఎక్కువకాదు బాబూ! పన్నెండు తర్వాత ఒంటిగంట అవుతుంది?" అమాయకంగా అన్నాడు రైతు.

—జోకర్ (హైదరాబాద్)

రాఘవరావు. తాపీగా నెమ్మదిగా ప్రపంచంలో టైమంతా తనదే అయినట్టు రైటర్, నర్స్, డాక్టర్ పనులు చేస్తున్నారు.

ఎవరెంత తాపీగా పనిచేయగలరు అన్న విషయం మీద వాళ్ళలో వాళ్ళే పోటీ పెట్టు కున్నట్టున్నారు. ప్రతీ ఒక్కరునెగ్గాలని ప్రయత్నిస్తున్నారు.

రాఘవరావు కళ్ళు మూతలు పడ్డాయి.

ఊపిరి వుండి వుండి తీస్తున్నాడు. డాక్టరు పరీక్ష చేసి చూశాడు. "పెద్ద దెబ్బలేం కాదు.

బాగా రక్తం పోయింది. రక్తం ఎక్కించాలి.

రక్తం లేదు... వీళు తాలుకు వాళ్ళు ఎవరైనా ఉన్నారా?"

"లేరు... రోడ్డు మీద పడుంటే తీసుకొచ్చాం"

"ఐసీ... రక్తం లేకపోతే ఎలా?.. నెక్ట్స్ ..." నిర్లిప్తంగా రాఘవరావుకేసి చూసి అన్నాడు.

"రక్తం కొని తీసుకురండి... ఎవరైనా డోనర్ఇచ్చినా సరే.. అది లేకపోతే

ట్రీట్ మెట్ కుదరదు"

తల్లి తండ్రి స్నేహితుల్లు, మామగారు బావలు, బావమరదులు, అక్కా చెల్లెళ్ళు భార్యావీళ్ళందరూ రక్తం అడిగిందే తడవుగా ఇవ్వగలరు. రాఘవురావు ఈ పరిస్థితిలో వున్నట్టు వాళ్ళెవరికీ తెలియదు.

టించ్చర్ అయోడిన్, గాజుబట్ట, దూది తీసుకువచ్చింది నర్సు. రాఘవరావు తలను వం కీలా తిప్పి నాలుగు చుట్లు వేసి కట్టు కట్టింది. కట్టు పూర్తయిన తర్వాత అనుమానం వచ్చింది. నాడి చూసింది... లేదు..

"డాక్టర్!" పిలిచింది.

"వాట్! ఈజ్ హి డెడ్!"

అవునన్నట్టు తలూపింది నర్సు.

"మార్చురీలో పెడదాం. వాళ్ళ వాళ్ళకి కబురుపంపు" కానిస్టేబుల్ మద్దేశించి అన్నాడు డాక్టర్.

సమయానికి సహాయం అందితే రాఘవ రావు అదే రోజు ఇంటికెళ్ళి వుండేవాడు. ఆ గుంపుకు స్పందన లేదు. ఆ పోలీసుకు డ్యూటీ తప్ప ప్రాణం విలువ తెలీదు. ఆ డాక్టర్ కు రోజూ ఇలాంటి వాళ్ళెంతమందో..

రోడ్డు మీద చచ్చిన కుక్క మీదనుంచి ఎన్నో వాహనాలు పోయాయి. చీకి చివికిన కుక్కచర్మం, కొంచెం కొంచెంగా మట్టిలో కలుస్తోంది.